ఆరోగ్య పరిరక్షణ అవశ్యం

- పరీక్షల సమయంలో ఆరోగ్య నియమాలే శ్రీరామరక్ష
- ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం
- మార్చి 1 నుంచి ఇంటర్, 17 నుంచి 'పది' పరీక్షలు
- తగినంత నిద్ర, పౌష్టికాహారం తప్పనిసరి
- విద్యార్థులకు వైద్యులు, సామాజికవేత్తల సూచనలు



అంగరలోని కళాశాలలో ప్రాక్టికల్ పరీక్షా కేంద్రం వద్ద వైద్య శిబిరం

కపిలేశ్వరపురం: విద్యార్థులు తమ శ్రమ విలువను వార్షిక పరీక్షల్లో ఫలితాల రూపంలో చూసుకుంటారు. ఏడాది కష్టమంతా వచ్చిన మార్కులతో బేరీజు వేసుకుంటారు. మెరుగైన ఫలితాలు వచ్చినవారు మురిసిపోగా ప్రతికూల ఫలితాలు పొందినవారు విచారాన్ని వ్యక్తం చేస్తుంటారు. ఫలితాలు మాత్రమే కాక పరీక్షా కాలంలో చదువుకునే పద్ధతుల పట్ల సైతం విద్యార్థులు శాస్త్రీయ అవగాహనను కలిగి ఉండాలంటున్నారు వైద్యులు, సామాజిక కార్యకర్తలు. ప్రతి ఆలోచన, కార్యాచరణ విద్యార్థి మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయంటున్నారు. మార్చి 1 నుంచి 20 వరకూ ఇంటర్, మార్చి 17 నుంచి 30 వరకూ పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో విద్యార్థులకు వైద్యులు, సామాజిక కార్యకర్తలు చేస్తున్న సూచనలపై కథనం..

పది ఫలితాల్లో ముందంజ

2023–24 విద్యా సంవత్సరంలో మండపేట మండలంలో 1,008 మంది పదో తరగతి పరీక్షలు రాయగా 817 మంది ఉత్తీర్ణులై 81 శాతం ఫలితాన్ని సాధించారు. రాయవరం మండలంలో 700 మందికి గానూ 614 మంది పాసై 87 శాతం, కపిలేశ్వరపురం మండలంలో 387 మందికి గానూ 375 మంది ఉత్తీర్ణులై 97 శాతం ఫలితాలు నమోదు చేశారు. రామచంద్రపురం పట్టణంలో 391 మందికి గానూ 314 మంది పాసై 81 శాతం, రామచంద్రపురం రూరల్ మండలంలో 533 మందికి గానూ 450 మంది ఉత్తీర్ణులై 85 శాతం, కె.గంగవరం మండలంలో 450 మందికి గానూ 418 మంది పాసై 93 శాతం, కాజులూరు మండలంలో 95 శాతం ఫలితాలను సాధించారు.

ఇంటర్ ఫలితాల్లో నిరాశ

2023–24 ఇంటర్ ఫలితాల్లో మండపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 121 మంది పరీక్షలు రాయగా 51 మంది పాసై 42 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాయవరం ప్రభుత్వ కళాశాలలో 43 మందికి 17 మంది పాసై 40 శాతం, పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 47కి ఏడుగురు పాసై 14 శాతం, రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజుపంతులు జూనియర్ కళాశాలలో 104 మందికి 76 మంది పాసై 73 శాతం ఫలితాలను సాధించారు. ఒకేషనల్ కోర్సుల్లో 85 మందికి గానూ 73 మంది పాసై 85 శాతం ఫలితాలను సాధించారు.

సాత్వికాహారమే మేలు



సాధారణ రోజులకూ, పరీక్షా కాలంలో పరిస్థితులకు వ్యత్యాసాలుంటాయి. సాధారణ రోజుల్లో విద్యార్థులు ఆడుతూ పాడుతూ చలాకీగా ఉంటారు. చిన్నపాటి మానసిక సమస్య వచ్చినా పట్టించుకోకుండా ముందుకు సాగుతారు. పరీక్షా కాలంలో అందుకు భిన్నంగా ఉంటారు. ఆందోళనతో కూడిన మనస్సు శరీరంపై ప్రభావం చూపుతుంది. తిన్న ఆహారం వంటపట్టని స్థితికి చేరుతారు. ఈ కారణంగా పోషక విలువలు గల ఆహారాన్ని సమపాళ్లలో తీసుకోవాలి. రోజూ ఓ పండు, వారంలో రెండు రోజులు ఆకు కూరలు విధిగా ఉండేలా చూసుకోవాలి. అరుగుదలకు ఇబ్బంది కలిగించే మాంసాహారాన్ని మాని, పరీక్షలు అయ్యే వరకూ సాత్వికాహారాన్ని తీసుకోవడం మంచిది.

రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం మండలం.

పరీక్షను పండగలా భావించాలి



విద్యార్థులు సహజంగా పరీక్ష అంటే ఆందోళనకు గురవుతుంటారు. వాస్తవానికి పరీక్షలో కొత్తదనమంటూ ఏదీ ఉండదు. ఏడాది కాలంగా విన్నవీ, చదివినవీ, రాసినవే ప్రశ్నల రూపంలో వస్తాయి. ఆయా అంశాలను క్రోడీకరించి సమాధాన పత్రంపై రాసేదే పరీక్ష అని పాజిటివ్‌గా భావించాలి. ప్రణాళికాబద్ధంగా చదువుకోవడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యంపై సైతం దృష్టి సారించాలి.

చల్లా మెహర్ ప్రసన్న, హోమియో వైద్యులు, మండపేట

తగినంత నిద్రతో మేలు



పరీక్ష అనగానే తెల్లవార్లూ చదవాలని ఎక్కువ మంది విద్యార్థులు భావిస్తుంటారు. అది కేవలం అపోహ మాత్రమే. చదివేందుకు శరీరమూ, మనస్సు అంగీకరించాలంటే రోజుకు కనీసం ఆరు గంటల నిద్ర అవసరం. అంతకు మించి నిద్రపోవడం బద్ధకమవుతుంది. శరీరం, మనస్సు ఒక దానికొకటి అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి.

ప్రశాంతి, సబ్ డివిజినల్ అధికారిణి, రామచంద్రపురం మండలం.

వైద్య సిబ్బందితో పర్యవేక్షణ



పరీక్షా కేంద్రాల వద్ద ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాల వద్ద శిబిరాలు కొనసాగుతున్నాయి. పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద సైతం శిబిరాలు నిర్వహించేందుకు అధికారుల నుంచి ఆదేశాలున్నాయి. శిబిరాల్లో అత్యవసర మందులు అందుబాటులో ఉంచుతాం.

కె.తాతారావు, ఎంఈఓ, కపిలేశ్వరపురం.

ప్రయాణాల్లో నిర్లక్ష్యం వద్దు



పరీక్షా కాలంలో విద్యార్థులకు ప్రతి క్షణమూ విలువైనదే. రహదారులపై అనవసర ప్రయాణాలను మానుకోవాలి. ప్రమాదాలతో గాయాల పాలైతే పరీక్షలపై ప్రభావం పడుతుంది. పది, ఇంటర్ విద్యార్థులకు వయస్సు రీత్యా వాహనాన్ని నడిపే అర్హత ఉండదు. వారు వాహనాలపై పరీక్షలకు వెళ్లడం సరికాదు. పరీక్షా కేంద్రాలకు సకాలంలో సురక్షితంగా వెళ్లేందుకు ఒక గంట ముందుగానే బయలుదేరాలి. లిఫ్ట్ అడుగుతూ వాహనాలను ఆశ్రయించొద్దు.

పి.దొరరాజు, రూరల్ సీఐ, మండపేట.

క్లుప్తంగా

నేడు రథోత్సవం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం మధ్యాహ్నం 2:55 గంటలకు రథోత్సవం ప్రారంభమవుతుందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి అల్లు వెంకట దుర్గా భవాని సోమవారం తెలిపారు. ద్రాక్షారామ పురవీధులలో స్వామి, అమ్మవార్లు రథంపై ఊరేగుతూ వేగాయమ్మపేటలో గల అటుకుల మండపానికి చేరుకుంటారన్నారు. అనంతరం అక్కడ పూజాధికాలు జరిపించి తిరిగి మరుసటి రోజు ఉదయం దేవస్థానానికి చేరుకుంటారన్నారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ రథోత్సవంలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


తహసీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోలు

కాజులూరు: రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు కోరారు. సోమవారం తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ రెవిన్యూ ఉద్యోగులు మండల తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారులకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు డీడీఓలుగా ఉండడంతో నిర్దేశించిన పనుల విషయంలో రెవెన్యూ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు విభేదాలు తలెత్తుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి రెవెన్యూ ఉద్యోగులకు డీడీఓలుగా తహసీల్దార్లను కొనసాగించాలని కోరారు.

ఎస్సై కుటుంబీకులకు రూ.45 లక్షల ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న పోలీసు ఉద్యోగ సంఘాల సభ్యులు

కె గంగవరం: ఇటీవల మృతి చెందిన ఎస్సై ఏజీఎస్ఎన్ మూర్తి కుటుంబ సభ్యులకు సోమవారం పోలీసు ఉద్యోగ సంఘాల సభ్యులు రూ.45 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఆంధ్ర, తెలంగాణాకు చెందిన బ్యాచ్ సహచరులంతా కలసి తమ అసోసియేషన్ నుంచి రూ.30 లక్షలు, ఏలూరు రేంజ్ బ్యాచ్ సహచరులు రూ.10.58 లక్షలు, శిక్షణ సహచరులు రూ. 1.10 లక్షలు, పశ్చిమ గోదావరి ఎస్పీ రూ.4 లక్షలు కలిపి మొత్తం రూ 45.68 లక్షల సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

సలాది అప్పారావుకు ఎమ్మెల్సీ తోట పరామర్శ


కోరుమిల్లిలో అప్పారావును ఓదార్చుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: సతీ వియోగంతో బాధ పడుతున్న కోరుమిల్లికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ సలాది అప్పారావును సోమవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. అప్పారావు సతీమణి సూర్యకాంతం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చంద్రు చిట్టిబాబు, ఎంపీటీసీ పలివెల మధు, మండల సాగు సలహా మండలి మాజీ చైర్మన్ పుట్టా కిట్టిబాబు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పెంకే గంగాధరం, నాయకులు సాధనాల శివ భగవాన్, కురుపూడి రాంబాబు, పూసబ్బు ఉన్నారు. మాతృ వియోగంతో బాధ పడుతున్న నల్లూరుకు చెందిన వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పుట్టా కృష్ణమూర్తిని ఎమ్మెల్సీ తోట పరామర్శించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అంబాజీపేట: ఇంటి డాబా మెట్లు ఎక్కుతుండా ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముక్కామల సినిమా రోడ్‌కు చెందిన నేదునూరి వెంకటేశ్వరరావు (62) ఈ నెల 8వ తేదీన తన ఇంటి వద్ద డాబా మెట్లపై నడుస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోవడవంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. దాంతో అతని కుటుంబ సభ్యులు, స్థానికులు అమలాపురం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు.

భీమేశ్వరస్వామి సన్నిధిలో జిల్లా జడ్జి శంకరరావు


జిల్లా జడ్జి శంకరరావుకు ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎం శంకరరావు కుటుంబ సమేతంగా మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామిని సోమవారం దర్శించుకున్నారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వెంకటదుర్గా భవాని ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్నాయిపేటలో వేంచేసి యున్న విజయదుర్గా పరమేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం శ్రీదేవి బాలభక్త సమాజం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. కాకిలేటి ముత్యాలరావు, భాగ్యలక్ష్మి దంపతుల నేతృత్వంలో కలశ స్థాపన, అఖండ ఏకాహం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం, పలివెల నాగరాజు బృందం, అయ్యప్ప భజన బృందం(తిరణంపేట), తాటిపాక విజయ దుర్గా మహిళా సమాజం, ద్రైరం వీర వెంకట సత్యనారాయణ(సతార్‌స్వామి) బృందం, అయ్యప్ప భజన బృందం(ద్రాక్షారామ), దాసరిపాడు ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజాల ఆధ్వర్యంలో నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

అనుబంధ విభాగాల అధ్యక్షులకు ఎమ్మెల్సీ తోట అభినందన


అనుబంధ విభాగాల అధ్యక్షులను అభినందిస్తున్న తోట త్రిమూర్తులు

మండపేట: పార్టీ ఎంపిక చేసిన అనుబంధ విభాగాల చైర్మన్లు, వారికి కేటాయించిన శాఖల్లో విధులు సక్రమంగా నిర్వర్తించి కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని శాసన మండలి సభ్యుడు, మండపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట త్రిమూర్తులు సూచించారు. మండపేట నియోజకవర్గానికి సంబంధించి పలు విభాగాల అధ్యక్షులను నియమించిన నేపథ్యంలో నూతనంగా పార్టీ పదవులు అలంకరించిన నాయకులను ఆయన అభినందించారు. మున్సిపల్ విభాగం అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, సోషల్ మీడియా అధ్యక్షుడు జొన్నపల్లి సత్తిబాబు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు కొనగళ్ల భాస్కరరావులను విజయలక్ష్మి నగర్లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ.. నిరంతరం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి గత ప్రభుత్వం చేసిన మంచిని గుర్తు చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ వారిని అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిల్ విప్ పోతంశెట్టి వరప్రసాద్, పార్టీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, సీనియర్ నాయకులు జిన్నూరి సత్యసాయిబాబా, పెంకే వెంకట్రావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పెంకే గంగాధర్ పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజమే లక్ష్యం కావాలి

- పీహెచ్‌సీల వైద్యాధికారి రత్నకుమారి
- విద్యార్థులు, చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


అంగరలోని సిద్ధార్థ కళాశాలలో విద్యార్థికి మాత్ర అందజేస్తున్న ప్రిన్సిపాల్ రమణ


వెల్లలో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

కపిలేశ్వరపురం: విద్యార్థులు, చిన్నారులు తమ ఆరోగ్యం పట్ల అవగాహనను కలిగి ఉండాలని అంగర, అచ్యుతాపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు పీఎస్ఎస్‌డీ రత్నకుమారి, కె.విజయదీపిక, డాక్టర్ అలేఖ్య అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా సోమవారం ఆయా పీహెచ్‌సీల పరిధిలో 19 ఏళ్ల లోపు విద్యార్థులు, చిన్నారులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వైద్య, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు వెళ్లి మాత్రలను మింగించారు. అంగర పీహెచ్‌సీ పరిధిలో 28 అంగన్వాడీ కేంద్రాలు, 15 ప్రభుత్వ, 8 ప్రైవేటు పాఠశాలల్లోని 3,783 మంది లక్ష్యం కాగా తొలి రోజు సోమావారం 3,679 మందితో మాత్రలను మింగించి 97.8శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు. 59 మంది గర్భిణులకు మాత్రలను అందజేశారు. మిగిలిన వారికి ఈ నెల 17న మాత్రలను అందజేయనున్నట్టు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల ఎంపీహెచ్‌ఈఓలు జిత్తుక మల్లికార్జునుడు, గోపాలకృష్ణ, ఎంపీహెచ్ ఎస్ శ్రీధర్, హెచ్‌ఈ బి.రామారావు, హెల్త్ అసిస్టెంట్ ఎస్.రవీంద్రకుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: డీవార్మింగ్ డే సందర్భంగా వెల్ల హైస్కూల్‌లో సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలనా దినోత్సవాన్ని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి లక్ష్మీ ప్రసన్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. నులి పురుగుల వలన పిల్లలలో రక్తహీనత, ఆకలి మందగించడం, కడుపునొప్పి వస్తుందని, వీటి నివారణకు గాను 1–19 ఏళ్ల వయసు గల పిల్లలకు మాత్రలను మింగిస్తున్నామని తెలిపారు. డివిజినల్ సూపర్‌వైజర్ కమల్ శేషు మాట్లాడుతూ ద్రాక్షారామ పీహెచ్‌సీ పరిధిలో 7,813 పిల్లలకు గానూ 7,489 పిల్లలకు మింగించి 95 శాతం, వెల్ల పీహెచ్‌సీ పరిధిలో 2,744 పిల్లలకు గానూ 2,596 పిల్లలకు మింగించి 98 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన పిల్లలకు ఈ నెల 17న మాప్‌అప్‌గా అందిస్తామన్నారు. రామచంద్రపురం పట్టణంలో 98శాతం పిల్లలకు మాత్రలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వీరభద్ర రాజు, సూపర్వైజర్‌లు కే శ్రీనివాస్, డి రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ రవికుమార్, ఏఎన్ఎం విజయ్ కుమారి, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 'నాక్' గుర్తింపు



'నాక్' గుర్తింపునకు పాటుపడిన కళాశాల బృందం

మండపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీ గ్రేడ్ గుర్తింపునిస్తూ ఎన్ఏఏసీ (నాక్) అనుమతులు జారీ చేసింది. ఇటీవల కళాశాలను సందర్శించిన నాక్ బృందం వివిధ విభాగాలను పరిశీలించింది. రికార్డులు, విద్యాబోధన, మౌలిక వసతులు, ఉపాధ్యాయ సిబ్బంది పనితీరు, సామాజిక కార్యక్రమాలు, బోధనా పద్ధతులు, మూల్యాంకనం తదితర అంశాలను బృంద సభ్యులు పరిశీలించారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న నాక్ కళాశాలకు బీ గ్రేడ్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు అందజేసినట్టు ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. డిగ్రీ కళాశాలకు 2016లో నాక్ గుర్తింపు లభించిందన్నారు. నాక్ బృందం తాజా పర్యటనలో బీ గ్రేడ్ గుర్తింపు లభించినట్టు ఆయన వివరించారు. గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ప్రొఫెసర్లు శిరీష కులకర్ణి, బిలాస్ సోనూవాలే, ప్రమోద్ కుమార్‌రాయ్‌లు బృంద పరిశీలన చేసినట్టు తెలిపారు. నాక్ గుర్తింపు రావడంలో నాక్ కోఆర్డినేటర్ ఆనంద్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ నేమాని కిరణ్ కుమార్‌ల కృషిని ఆయన అభినందించారు. వచ్చే ఏడాది నుంచి పీజీ కోర్సులు ఆరంభించడానికి కృషి చేస్తామని వెల్లడించారు. సమావేశంలో అధ్యాపకులు శంకర్, కేఎస్ఆర్, డాక్టర్ నెహ్రూ నాయక్, వెంకన్న, డాక్టర్ మధు, గోపాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిచ్చర పిడుగులు

జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్‌లో పతకాల కైవసం


ప్రియదర్శన్ కార్తిక్‌ను అభినందిస్తున్న గ్రామ పెద్దలు


సురేష్‌కుమార్ అభినందన ర్యాలీ

రామచంద్రపురం రూరల్: ఈ నెల 1 నుంచి 5 వరకు న్యూ ఢిల్లీలోని కేడీ జాదవ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫోర్త్ వ్యాకో ఇండియా ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో తోటపేటకు చెందిన విద్యార్థి యాల్ల సురేష్‌కుమార్ క్రియేటివ్ ఫామ్‌లో గోల్డ్ మెడల్, పాయింట్ ఫైట్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. తోటపేటకే చెందిన మరో విద్యార్థి అల్లం ప్రియదర్శన్ కార్తిక్ క్రియేటివ్ ఫామ్ విభాగంలో సిల్వర్ మెడల్, లైట్ కాంటాక్ట్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈ మేరకు యాల్ల సురేష్‌కుమార్‌ను అభినందిస్తూ సోమవారం ద్రాక్షారామ ప్రధాన రహదారిలో కార్లతో ర్యాలీ నిర్వహించారు. అల్లం ప్రియదర్శన్ కార్తిక్‌కు తోటపేట గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు శిక్షకులు బీకే రత్నం, యండమూరి అంజనీ కుమార్, చొల్లంగి వినయ్ కుమార్, పెంద్ర బాలకృష్ణలను గ్రామస్తులు, పెద్దలు అభినందించారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి


బ్రహ్మోత్సవాల కరపత్రికలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఆలమూరు: చింతలూరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17 నుంచి జరగనున్న ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ తెలిపింది. స్థానిక ఆలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు అల్లంరాజు రామకృష్ణమూర్తి, ద్విభాష్యం కాశీ విశ్వనాథశర్మ, అల్లంరాజు భరణీకుమార్ ప్రసంగించారు. టీటీడీ తరహాలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పాంచాహ్నిక పద్ధతిలో ఐదు రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నామన్నారు. ఈనెల 17న శేష వాహనం, 18న గరుడ వాహనం, 19న గజ వాహనం, 20న హనుమత్ వాహనం, 21న కల్పవృక్ష ముత్యాల పందిరి వాహనంలో దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈనెల 22న జరిగే పూర్ణాహుతి కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగియున్నాయన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో వేంకటేశ్వర సన్నిధిలో బ్రహ్మోత్సవాల కరపత్రికను ఆవిష్కరించారు. వెల్ల సత్యనారాయణ, పసలపూడి శ్రీనివాసు, నామాల రామకృష్ణ, ఆలయ పురోహితులు పివివిఎస్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తుల తాగునీటి తిప్పలు

స్పందించని సిబ్బంది

కాజులూరు: చేదువాడ, ఎస్సీపేటలకు 20 రోజులుగా తాగునీరు సరఫరా నిలిచిపోవటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం గ్రామానికి చెందిన పినిపే కొండ, గుత్తాల బ్రహ్మాజీ, పిల్లి భవాని, కూరాటి జ్యోతి, రాయుడు శ్రీనివాసు తదితరులు మాట్లాడుతూ గ్రామంలో జరుగుతున్న గొల్లపాలెం– కుయ్యేరు రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా గత 20 రోజుల క్రితం కుళాయి పైపులైను విడిపోయిందన్నారు. దీంతో మంచినీటి కుళాయిలకు తాగునీరు సరఫరా జరగటం లేదన్నారు. రోడ్డు నిర్మాణంలో పైపులైను కట్ కావడంతో సంబంధిత కాంట్రాక్టరు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. గ్రామంలోని మంచినీటి బావులు, చేతి పంపులు శిథిలావస్థలో ఉన్నాయని వాపోయారు. అధికారులు స్పందించి త్వరితగతిన పైపులైను మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా రజకుల బల్లల పండుగ


అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

రాయవరం: రాయవరంలో సోమవారం రజకుల బల్లల పండగను ఘనంగా నిర్వహించారు. ఏటా రజక సామాజిక వర్గం బల్లల పండగను నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. అందులో భాగంగా నిర్వహించిన పండగలో భాగంగా వీరభద్రుడు, వీరగనికమ్మలను శిరస్సున ధరించి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చెరువు వద్దకు వెళ్లి పూజాధికాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.